సరే కానివ్వండి!

అత్తమామలు గుడిసెమధ్య కూర్చుని ఏమోగుసగుస లాడుకుంటున్నారు. అత్తపేరు వెంకమ్మ; మామపేరు వెంకయ్య. వాళ్ళ పెళ్ళినాడు— "పేర్లు బలేబాగా కుదిరినై" అనుకున్నారు అంతా.

వాళ్ళ కోడలిపేరు సిద్దమ్మ; కొడుకుపేరు సీనప్ప. సీనప్ప ఆరు నెలల కిందట ఇల్లు విడిచి పరారయ్యాడు. ఇంతవరకూ వత్తాలేదు. ఆరు నెలనించీ పోలీసులు వెతుకుతూనే వున్నారు. సీనప్ప కోసం.

సీనప్ప పరార్యాఅవటానికి కారణం ఆవూరు కరువొచ్చింది. వర్షం మీద ఆధారపడ్డ సేద్యం. ఆ సంవత్సరం వర్షాల్లేక వేసిన పైరు వేసినట్టుగా మాడిపోయింది.

సీనప్ప తండ్రి చాలాకాలంనుంచీ మణేదారురామయ్యగారి పొలం అయిదు ఎకరాలు కౌలుకి తీసుకుని చేస్తూండేవాడు. భుక్తికి లోటులేకుండా జరుగుతుండేది. ఎప్పుడూ బకాయిపడి ఎరగడు.

ఈ సంవత్సరం ఒక్క గింజ కూడా పండలేదు. బాకీవొచ్చే పంటలో తీర్చుకుంటానన్నాడు వెంకయ్య. మణేదారు రామయ్య వొప్పుకోలేదు. వెంకయ్యకున్న ఎడ్ల జతని, ఆవుని, దూడని, గేదెని, మరికొంత సామానూ జప్తుకితెచ్చి బాకీక్రింద జమకట్టుకున్నాడు మణేదారు రామయ్య.

చేతులలోవున్న పొలం పోయేటప్పటికి ముసలివాడు మంచం ఎక్కాడు. సీనప్ప కూలి కోసం తిరిగాడు.

పంటలు పండకపోతే కూలి ఎక్కడ దొరుకుతుంది?

క్రమేణాకరువు చుట్టుపక్కల గ్రామాదులన్ని వ్యాపించింది. ఒకరోజు అనుకోకుండా ఊళ్ళోవున్న బీదజనం అంతా మణేదారు రామయ్య ఇల్లు చుట్టుముట్టారు. అందులో సీనప్పకూడా వున్నాడు.

"ఏం కథ?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఏముందీ?" అన్నాడు సీనప్ప.

"ఏం లేకేం?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఉండబట్టే వొచ్చాం" అన్నాడు సీనప్ప.

"అయితే ఏమిటో చెప్పూ?" అన్నాడు మణేదారు రామయ్య.

"చెప్పటానికేగా వచ్చింది!" అన్నాడు సీనప్ప. అతనికీ ఏం చెప్పాలో తోచలేదు.

ఇంతలో "అన్నం కావాలి" అని కేకవేశాడు ఒకడు జనంలో నుంచి.

"నా దగ్గర ఎక్కడుంది?" అన్నాడు మణేదారు రామయ్య.

"మరి నీ తాత దగ్గర వుందా?" అన్నాడు సీనప్ప.

"మాటలు జాగ్రత్తగా రానియ్" అన్నాడు మణేదారు రామయ్య.

"పురులు కోయిస్తావా?" అన్నాడు సీనప్ప.

సీనప్ప నోటినుంచి "పురులు" అనే మాట బయటపడగానే జనం పురుల మీదకు ఎగబడ్డది. ఎక్కడనుంచి వచ్చారో పోలీసులు! టపటప తుపాకులు పేల్చారు. ఆ రోజు ఆరుగురు మరణించారు. అప్పటినుంచీ మణేదారు రామయ్యమీద సీనప్పకు అమితకోపంగా వుంది. దానికి తగ్గట్టు రెండోరోజు మరొకటి జరిగింది. సిద్దమ్మని,డారేపోతూ కనబడి కావాలంటే డబ్బిస్తా రమ్మని ఇంటికి తీసుకు వెళ్ళాడట మణేదారు రామయ్య. తీసుకు వెళ్ళి ఏమిటేమిటోగా చూశాడట.సిద్దమ్మ ఏడుస్తూవచ్చి సీనప్పకి చెప్పింది, సీనప్ప వెళ్ళి మణేదారు రామయ్యని అడిగాడు:

"ఏం కథ?" అన్నాడు సీనప్ప.

"ఏముందీ?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఏం లేకేం?" అన్నాడు సీనప్ప.

"ఉంటే చెప్పూ" అన్నాడు మణేదారు రామయ్య.

"నూకల్ని పెడతా మేకల్ని కాస్తా" అన్నాడు సీనప్ప.

"ఆఁ" అన్నాడు మణేదారు రామయ్య.

"పెద్దపులి వస్తే అడవకుండా వుంటా" అన్నాడు సీనప్ప.

"ఆఁ" అన్నాడు మణేదారు రామయ్య.

కర్రతో తలమీద ఒక వేటువేసి "ఆడిశావేం?" అన్నాడు సీనప్ప.

దెబ్బకి మణేదారు రామయ్య క్రిందపడిపోయ్యాడు. చిల్లిపడి నెత్తురు కారింది. ఆ నెత్తురు చూసేటప్పటికి సీనప్పకి పోలీసులు జ్ఞాపకం వచ్చారు. కొండల్లోకి పారిపోయాడు.

అప్పటికి సిద్ధమ్మకి ఏడో నెల. సీనప్పకి జరిగింది, మరిది ద్వారా విని అకాలంగా ప్రసవించింది.

సీనప్ప వెళ్ళిన దగ్గరనుంచీ కుటుంబం మరీ మరీ అన్యాయం అయింది. మాటిమాటికీ పోలీసుజులుం. ఊళ్ళో తప్పున్న వాళ్ళెవ్వరూ "రామ రామ" అనరు. మణేదారు రామయ్య పగబట్టాడు. ఈ విషయమే గుడిసెముద్ధ కూర్చొని సిద్ధమ్మ అత్తమామలు గుసగుసలాడేది.

"వాడు మనకి పుట్టలేదనుకో" అన్నాడు వెంకయ్య.
"అనుకుంటే అవుద్దీ?" అన్నది వెంకమ్మ.
"అప్ప కొ్గడుతుందా?"
"కొట్టాలి?" అన్నది వెంకమ్మ
"మరి ఎందుకు ఏడవాలి?"
"కన్న కడుపుగా మరి" అన్నది వెంకమ్మ.
"దాని సిగ తరిగిరి" అన్నాడు వెంకయ్య.
"దేని సిగా?" అన్నది వెంకమ్మ.
"దాని సిగే!" అన్నాడు వెంకయ్య.
"నోటితో చెప్పరా?" అన్నది వెంకమ్మ.
"కన్న కడుపు సిగ" అన్నాడు వెంకయ్య.
"రామయ్య తండ్రీ!" అన్నది వెంకమ్మ.
"ఓరి మణేదారు రామయ్యా!" అన్నాడు వెంకయ్య.

"వెళ్ళినవాడు రాడేం?" అన్నది వెంకమ్మ.

"ఎందుకు వస్తాడే పిచ్చిదానా?" అన్నాడు వెంకయ్య.

"ఏం" అన్నది వెంకమ్మ.

"వస్తే కూడెట్టొద్దూ?"

ఈ గుసగుసలు వింటున్న సిద్దమ్మకి కోపం వొచ్చింది. నాలుగు రోజులనుంచి ఇంట్లో బియ్యంలేవు. తాను స్మశానానికివెళ్ళి యింత ఉత్తరేణి ఆకు కోసుకొచ్చి వొండింది. ఏమీ తినకపోతే పిల్లవాడికి పాలు వుండవని భయం. అంతకుముందు దాకా కదలకుండా కూర్చున్న అత్తమామలు ఆకు పొయ్యి మీదనుంచి దింపేటప్పటికి నాకు పెట్టమంటే నాకు పెట్టమని పోట్లాడారు. ఇప్పుడు సీనప్పని ఆడిపోసుకుంటున్నారు.

"అయిందా?" అన్నది సిద్దమ్మ కోపంగా

"అవకేం?" అన్నాడు వెంకయ్య

"బియ్యం పట్టుకుతా" అన్నది సిద్దమ్మ
"ఎక్కడ?" అడిగాడు వెంకయ్య

"వల్లకాట్లో" అన్నది వెంకమ్మ

"గవర్నమెంటువాళ్ళు ఇస్తున్నారంట" అన్నది సిద్దమ్మ.
"పొద్దున్న వెళ్తిమే!" అన్నాడు వెంకయ్య.

"తీసుకు రాలేదేం మరి?" అన్నది సిద్దమ్మ.
"బియ్యం ఇచ్చేది— "నసుకుతున్నాడు వెంకయ్య
మణేదారు రామయ్యే!" చెప్పేసింది వెంకమ్మ

ఈ మాట వినేటప్పటికి సిద్దమ్మకిఅత్తమామలమీదకోపం వొచ్చింది తిండిదొరక్కపోవటానికి తనే కారణం అయినట్టు మాట్లాడతారు. మణేదారు రామయ్యని తన మొగుడు కొట్టబట్టే కరువు వొచ్చినట్టు నటిస్తారు. "ఏదో వొకటి తీసుకురండి" అన్నది సిద్దమ్మ.

"ఏమిటే వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య.

"ఏమిటో—" అన్నది వెంకమ్మ.

"వెళ్ళరేం?" అని గద్దించింది సిద్ధమ్మ.

"మణేదారు—" అని మొదలు పెట్టాడు వెంకయ్య.

అప్పుడు ఆమెకు తట్టింది—"గంజేరాకు తీసుకురండి" అన్నది సిద్ధమ్మ.

అత్త మామలకు ఆమెను చూస్తే భయం వేసింది.

"పద ముసలాడా" అన్నది వెంకమ్మ.

"పదవే, భామా" అన్నాడు వెంకయ్య.

వాళ్ళు వెళ్ళగానే పిల్లవాణ్ణి చేతుల్లో పెట్టుకుని కొండల మీదకు పరుగెత్తింది సిద్ధమ్మ.

* * * *

ఈ ఆరు నెలలనుంచీ సీనప్పకోసం వెతికి చూస్తూనే వుంది సిద్దమ్మ. కొడుకు పుట్టాడని కూడా తెలియదు తన మొగుడికి. తెలిస్తే ఎంత సంతోషిస్తాడు! పైగా వూళ్ళో అంతా "అచ్చగా సీనప్పే" అన్నారు.

సీనప్ప ఎప్పటికైనా కొడుకుని చూసుకోలానికి తప్పకుండా వొస్తాడని సిద్ధమ్మ నమ్మకం. అప్పటికి పిల్లవాడు చిక్కి పోకుండా బొద్దుగా వుండేటట్టు చూచుకోవాలి. మణేదారు రామయ్య ఆవునూ, గేదెనూ తోలుకు వెళ్ళాడు. ఇక తన పాలే పిల్లవాడికి ఆధారం. అత్తమామలకు పెట్టకుండా అయినా సరే తన కడుపునింపుకుంటూ వుండేది సిద్ధమ్మ. ఇరవై రోజుల క్రిందట సీనప్ప ఆదవాని లంకలో ఎవరికో కనిపించాడని తెలిసింది సిద్ధమ్మకి. వెంటనే తెలుసుకు రమ్మని మరిదిని పంపింది. అప్పటినుంచీ రోజూ కొండమీదికి ఎక్కి మరిదికోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఇవ్వాళ కొండ ఎక్కేటప్పటికి మరిది కనిపించాడు. "కనపడ్డాడా?" — అడిగింది సిద్దమ్మ.

"నే నెవర్ని!" అడిగాడు మరిది.

"సీనప్ప తమ్ముడివి" అన్నది సిద్ధమ్మ.

"కనపడ్డాడు" అన్నాడు మరిది.

సిద్ధమ్మకి ప్రాణం లేచివొచ్చింది. ఎప్పుడో చిన్నప్పుడు గొల్లకాడ బుడ్డాళ్ళు పాడుకుంటే వినేది. ఆ పాట యిప్పుడు జ్ఞాపకం ఒచ్చింది.

"గుర్రాలా గోసిరెడ్డీ

"నీ పేరే బంగార్ప కడ్డీ!"

"బుల్లోడిసంగతి చెప్పావా?" అన్నది సిద్ధమ్మ

"చెప్పేదాకానా" అన్నాడు మరిది.

"ఏం?" అడిగింది ఆమె.

"కనే అడిగాడు" అన్నాడు.

"ఏమన్నాడేంటి?" అడిగింది ఆమె.

"చెప్పేతలికి గంతేశాడు_"

"ఓలబ్బో!" అన్నది ఆమె.

"_ఎగిరి" అవి పూర్తి చేశాడు.

"సరి" అన్నది ఆమె.

మరిది మూలుగుతూ కూర్చొబడ్డాడు. అప్పుడు చూచింది సిద్ధమ్మ నడిచి నడిచి అతని కాళ్ళు బొబ్బలెక్కి వున్నై. పిల్లవాణ్ణి రాళ్ళమీద పడుకోబెట్టి మరిది కాళ్ళు పిసుకుతున్నది ఆమె. "నేను బయలుదేరి యెన్నాళ్ళయింది"? అడిగాడు మరిది.

"ఇరవై రోజులు" చెప్పింది సిద్ధమ్మ.

"సరి" అన్నాడు మరిది.

"ఎట్టా వున్నాడు?" అడిగింది.

"చలిమంటలాగా" అన్నాడు మరిది "దేశాన్ని తిరగవేస్తాడంట"

"సుదనాష్టపాడు" అంది మురిపెంగా.

"ఎటు పడితే అటే" అన్నాడు అతను.

"సరే" అన్నది.

సిద్దమ్మ యింకొక విషయం అడగాలనుకుంది. కాళ్ళు పిసకటం ఆపి మరిడిని తేరిపార చూసింది ఆమె, తేరుకొని లేచాడు అతను. బుల్లోడు మరిడిని చూసి బోసినవ్వునవ్వాడు. అకస్మాత్తుగా 'రా' అని జ్ఞాపకం వచ్చింది మరిడికి; "వొస్తానన్నాడు", అన్నాడు.

"ఎప్పుడు," అడిగింది.

"ఆదివారం" అన్నాడు.

"ఇవాళే" అడిగింది.

"మాపిటికి" అన్నాడు.

సిద్దమ్మకి చిన్నప్పుడు విన్న తోలుబొమ్మలపాట జ్ఞాపకం వచ్చింది. ఎప్పుడూ సీనప్ప పాడుతుండేవాడు!

రాత్రి పన్నెండు గంటలకీ
రాను నేను తిరిగివస్తే
రాను పొమ్మంటివే
రమణి ముద్దులగుమ్మ!

గుమ్మా! బలే గుమ్మా! అరే గుమ్మా!

"ముదనష్టపాడు" అన్నది మురిపెంగా.

"ఎటు తిరిగితే అటే" అన్నాడు.

"సరి" అన్నది.

* * * *

మరిదీ, సిద్దమ్మా యింటికి వొచ్చేతలికి వెంకమ్మా, వెంకయ్యా ఒక మూల ఒదిగి కూర్చొని ఏదో నములుతున్నారు.

వీళ్ళని చూచి తాటించటం ఆపేసి పట్టుబడ్డదొంగలకు మల్లే గుడ్లు మిటకరించారు.

"ఏమిటది?" అన్నది సిద్దమ్మ.

"నీళ్ళు–" అన్నాడు వెంకయ్య.

"ఏం చేస్తున్నారు?" అన్నది.

"నములుతున్నాం" అన్నది వెంకమ్మ.

వెంకమ్మ ఒళ్లో ఉన్న మూట సిద్దమ్మ చూచింది, లాక్కుంది. బియ్యం....

"ఎక్కడివి?" అడిగింది ఆమె.

"తెమ్మంటివే" అన్నాడు వెంకయ్య.

"తెచ్చాం" అన్నది వెంకమ్మ.

"ఎవరిచ్చారు?" అన్నది ఆమె.

"గంజేరాకు–" అన్నాడు.

"కాదు, కాదు–మణేదారు" అన్నది వెంకమ్మ. ఆమె బియ్యంమూట చేత్తో పట్టుకుని కొంచెంసేపు ఆలోచించింది.

"మణేదారు తలకాయ" అన్నది సిద్దమ్మ.

"మా నోట్లో కరక్కాయ!" అన్నది వెంకమ్మ.

"కరి మింగిన వెలక్కాయ" అన్నాడు వెంకయ్య. సిద్దమ్మ బయటికి వెళ్ళి కాకిగూడు పొడుచుకువచ్చి, పొయ్యి రాజేసి, బియ్యం పొయ్యిమీద పెట్టింది.

అన్నం వుడుకుతూంది. మరిది సోషవచ్చి కుక్కి మంచంలో పడుకున్నాడు. అత్తమామలు గుటకలుమింగుతూ కూర్చున్నారు.

పోలీసు వచ్చాడు: "ఏం కూర్చున్నారేం?" అన్నాడు.

అత్తామామలు నుంచున్నారు. సిద్దమ్మ తమకుఅన్నం పెడుతుందో లేదో అని చిరాగ్గావున్న వెంకయ్యకి పోలీసువాణ్ని చూసేతలికి కోపం వచ్చింది. పొయ్యిమీద వుడుకుతున్నకుండ బ్రద్దలుకొట్టి నోటి దగ్గరఅన్నం కాకులకీ, కుక్కలకి వేసేరకం.

"ఏం కథ?" అన్నాడు పోలీసు.

"కంచికి వెళ్ళింది" అన్నాడు వెంకయ్య.

"ఎక్కడ నీ కొడుకు" అడిగాడు పోలీసు.

"రంగం వెళ్ళాడే" అన్నాడు వెంకయ్య.

"నాయుడుగారూ" అన్నది వెంకయ్య.

పోలీసుకి ఏమీ తోచక తుపాకి మడమతో వెంకయ్యని పొడిచాడు.

"అబ్బ!" అన్నాడు వెంకయ్య.

"మరేమనుకున్నావు?" అన్నాడు పోలీసు.

"గాడిదగుడ్డనుకున్నారా తండ్రీ" అన్నాడు వెంకయ్య. పోలీసు వంటింట్లోకి వెళ్ళాడు. పొయ్యిమీద అన్నంవుడుకుతూ వుంది. పొయ్యిదగ్గర సిద్దమ్మ కూర్చొనివుంది. అన్నంమీద వున్న ఆశకొద్దీ వెంకయ్య పోలీసు వెంట వెళ్ళాడు. పోలీసుని చూసేటప్పటికి సిద్దమ్మ కంగారు పడింది. మావటికే సీనప్ప వచ్చేది! పసికడతాడేమో....

"ఛీ ఛీ కర్రేదీ?" అని కుక్కని అదిలించింది సిద్దమ్మ. కుక్కలేదు

"అన్నం వండుతున్నావే!" అన్నాడు పోలీసు.

"కొద్దిగా బియ్యం...." అన్నది సిద్దమ్మ

"ఎక్కడివి?" అన్నాడు పోలీసు; "దొంగిలించావా?"

ఇక తరువాత పొయ్యిమీద కుండపగలగొట్టడమే అని గ్రహించాడు. వెంకయ్య.

"ఏమ్, పోలీసూ?" అన్నాడు వెంకయ్య.

"ఏం?" అన్నాడు పోలీసు.

"బియ్యం ఎక్కడివో తెలుసా?" అడిగాడు వెంకయ్య.

"ఎక్కడివి?" అడిగాడు పోలీసు.

"గంజేరు—" అన్నాడు వెంకయ్య

"కాదు, కాదు. మణేదారు" అంది వెంకమ్మ; అప్పుడే వొచ్చింది.

మణేదారు పేరు వినేటప్పటికి పోలీసు కుండలోలికి వెళ్ళటం మానేశాడు. సిద్దమ్మనిచూచి అర్థయుతంగా నవ్వాడు. సిద్దమ్మకి సిగ్గువేసింది. అదీ మంచిదే అయింది.

"వెళుతున్నా, సిద్దమ్మా" అన్నాడు పోలీసు.

వెడుతూ, వెడుతూ తుపాకి మడమతో వెంకయ్యని ఒకపోటు పొడిచి వెళ్ళాడు

"నన్ను పొడవలేదే!" అన్నది వెంకమ్మ.

"నేను ఊరుకోనని భయం" అన్నాడు వెంకయ్య.

సిద్దమ్మ మరిదికి వేనీళ్ళు తోడి, పీపుతనే తోమి అన్నం వడ్డించింది. మరిది సేద తీరి అన్నానికి కూర్చున్నాడు.

"ముసలోళ్ళకి చెప్పొద్దు" అన్నది సిద్దమ్మ.

"ఏమని!" అడిగాడు మరిది.

"అతగా డొస్తాడని" అన్నది సిద్దమ్మ.

"చెబితే?" అన్నాడు మరిది.

"గోల చేస్తారు" అన్నది సిద్దమ్మ. "పోలీసు వాళ్ళకి తెలుస్తుంది"

"సరే, సరి" అన్నారు మరిది.

సిద్దమ్మ మరది అన్నం తింటున్నంత సేపూ అత్తమామలు గుటకలు మింగుతూ కూర్చున్నారు. తమ కేమీ మిగల నివ్వదేమోనని భయం.

"సిద్దమ్మా!" అన్నాడు వెంకయ్య.

"ఏం?" అన్నది సిద్దమ్మ.

"అహఁ, ఏం లేదు" అన్నాడు వెంకయ్య.

మరిది అన్నం తిన్న తర్వాత అతన్ని పడుకోబెట్టి పిల్లవాడికి పాలిస్తూ కూర్చుంది సిద్దమ్మ. "నీ బాబు వొస్తాడ్రా" అంది సిద్దమ్మ.

"ఉంజ్జ....ఉంజ్జ" అన్నాడు పిల్లవాడు.

"మా బాబుకి అన్నీ తెలుసు" అని ముద్దుపెట్టుకుంది సిద్దమ్మ.

పిల్లవాణ్ని పడుకోబెట్టి సిద్దమ్మ వంటయింట్లోకి వచ్చి చూసేతలికి అత్తమామలు కుండలోని అన్న బొక్కుతూ వున్నారు. వాళ్ళనిజూచి గుక్కలుపట్టి నవ్వింది సిద్దమ్మ. తిట్టిపోస్తుందనుకున్న అత్తమామలు ఆమె నవ్వుచూచి నిత్తరపోయారు. ఆమెకు వొక్క మెతుకు కూడా విడిచి పెట్టకుండా తిన్నందుకు వెంకయ్య కళ్ళల్లో నీళ్ల తిరిగినై.

"తిట్టవే, సిద్దమ్మా" అడిగాడు వెంకయ్య.

"ఇవాళ తిట్టను" అన్నది సిద్దమ్మ.

"ఎందుకనీ?" అడిగాడు వెంకయ్య.

"చెప్పనే చెప్పను" అన్నది సిద్దమ్మ.

"చెప్పనన్నా చెప్పు, తిట్టనన్నా తిట్టు" అన్నాడు వెంకయ్య.

"తిడితే నీ నోటి ముత్యాలు రాలిపోవులేవే" అన్నది వెంకమ్మ.

సిద్దమ్మ డొక్కలు చెక్కలయ్యేట్లు నవ్వింది.

"వెంకమ్మా—?" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా?" అన్నడి వెంకమ్మ.

"మనపెళ్ళి అయి ఎన్నేళ్ళయిందీ అంట?" అన్నాడు వెంకయ్య.

'నలభై ఏళ్ళవలా?' అన్నది వెంకమ్మ.

"ఎప్పుడైనా ఇటువంటి విడ్డూరం చూశావా?"అడిగాడు వెంకయ్య.

"చూడలేదు" అన్నదివెంకమ్మ.

"చూస్తే చెప్పవే?" అడిగాడు వెంకయ్య.

"చూడలేదు; భగవంతుడా, చూడలేదు" అన్నది వెంకమ్మ.

* * * *

చీకటి పడింది. సాయంకాలం పుతుక్కున్న చీర కట్టుకుని పిల్లవాణ్ని పడుకోబెట్టి, నీనప్పకోసం ఎదురు చూస్తూ వుంది సిద్దమ్మ. అత్తమామలు నిద్రపోతున్నారు. మరిదికాళ్ళు లాగుతున్నాయని మూలుగుతూ

పడుకున్నాడు. పడుకోబోయే ముందు "అన్నయ్య రాగానే లేపు వొదినా" అన్నాడు. సిద్దమ్మ నవ్వింది.

"నవ్వుతావేం?" అన్నాడు మరిది.

"పడుకో?" అన్నది సిద్దమ్మ.

"సరే, నీ యిష్టం" అన్నాడు మరిది. కాని, పడుకోటానికి బదులు మూలుగుతున్నాడు.

"ఓ వొదినా!" అన్నాడు మరిది.

"ఏం మరిదీ" అన్నది సిద్దమ్మ.

"అన్నయ్యతో ఎంత మంది కుర్రాళ్ళున్నా రనుకున్నావు?" అన్నాడు మరిది.

"ఎవళ్ళు!" అన్నది సిద్దమ్మ.

"ఎవళ్ళో!" అన్నాడు మరిది; "అంతా కలిసి దేశాన్ని తిరగతవ్వ తారంట. కరువులు రాకుండా చేస్తారంట."

"ముదనష్టపాడు!" అన్నది సిద్దమ్మ మురిపెంగా.

"అయితే పడుకోనా?" అన్నాడు మరిది.

మరిదికి నిద్రపట్టింది. కిటికీలోనుంచి బయటకు చూస్తూ నిలబడింది సిద్దమ్మ. దూరాన వున్న కొండలు కనిపిస్తున్నై. కొంచెం సేపటికి బయట కుక్క "భోంయి" మన్నది. గబగబావెళ్ళి తలుపు తీసింది సిద్దమ్మ. పోలీసు వాడు గస్తీ తిరుగుతున్నాడు. సిద్దమ్మ వొళ్ళు జలదరించింది. సీనప్ప పట్టు పడతాడేమో అని భయం వేసింది. ఎలాగైనా పోలీసు వాణ్ని పంపించి వెయ్యాలి.

"ఏమే చెల్లప్పా?" అన్నది సిద్దమ్మ. పోలీసు పేరు చెల్లప్ప.

"ఓహో. సిద్దమ్మా?" అన్నాడు చెల్లప్ప.

"ఎక్కడా కనపట్టంలేదే?" అన్నది సిద్దమ్మ.

"కరువొకటి వొచ్చిందా! రాత్రింబగళ్ళు పనే" అన్నాడు చెల్లప్ప.

"పాపం?" అన్నది సిద్దమ్మ.

"ఏం!" అన్నాడు చెల్లప్ప "డ్యూటీ అన్నాక డ్యూటీయే........"

"ఏందే అదీ?" అడిగింది సిద్ధమ్మ.

"ఏదీ?" అడిగాడు చెల్లప్ప.

"ఇప్పుడు నువ్వన్నమాట!"

"నే నేమన్నా నే—" మురిపెంగా ఏదన్నా మాట అందామనుకున్నాడు. "ముద్దులగుమ్మా!" బాగుండలేదు. "చిలకలకొలికీ." బాగుండలేదు. ఏమీ తోచక "సిద్దీ." అని వూరుకున్నాడు సిద్దమ్మ సరసకు వెళ్ళాడు చెల్లప్ప.

"ఓ లన్నా!" అన్నది సిద్దమ్మ.

"అదేం మాట?" అన్నాడు చెల్లప్ప.

"ఒడనె బాగుందా?" అడిగింది సిద్దమ్మ.

"ఇప్పుడు దాని సంగతి ఎందుకు సిద్దీ" అన్నాడు చెల్లప్ప. చెల్లప్పకి మూడో పెళ్ళి—భార్యమీద అనుమానం.

"కాదు అన్నా, రాత్రుళ్ళు నువ్విట్లా తిరుగుతూవుంటే"—అన్నది సిద్దమ్మ.

"చుఫ్"అన్నాడు చెల్లప్ప.

"కాదే. మరి రామయ్యగారి కిట్టప్ప అనేవాడు వొకడున్నాడా...." అన్నది సిద్దమ్మ.

"చుఫ్ చుఫ్" అన్నాడు చెల్లప్ప.

"నీకు తెలియదు కామాలు. ఇవ్వాళే వొచ్చాడు వూళ్ళోకి" అన్నది సిద్దమ్మ.

"చుఫ్ చుఫ్ చుఫ్ చుఫ్" అన్నాడు చెల్లప్ప.

ఇక చాలు అనుకున్నది సిద్దమ్మ. పొదచాటున నక్కి చెల్లప్ప చర్యలు గమనిస్తూ వుంది. చెల్లప్ప కొంచెంసేపు అటూఇటూ తిరిగాడు. చెల్లప్పకి చాలా కాలంనుంచీ రామయ్యగారి కిట్టప్పమీద అనుమానం వుంది; ఆగలేక ఇంటికి వెళ్ళాడు.

సిద్దమ్మ సంతోషంగా ఇంట్లోకి వెళ్ళింది.
"ఓ వొదినా!" అన్నాడు మరిది.

"చుఫ్" అన్నది సిద్దమ్మ.
"ఎక్కడికి కెళ్ళావు?" అన్నాడు మరిది.

"చుఫ్ చుఫ్" అన్నది సిద్దమ్మ.
"అదేమిటి వొదినా?" అన్నాడు మరిది.
"చుఫ్ చుఫ్ చుఫ్ చుఫ్" అన్నది సిద్దమ్మ.

* * *

సిద్దమ్మ సీనప్పకోసం కనిపెట్టుకొని కూర్చుంది. గది మళ్ళీ మళ్ళీ శుభ్రం చేసింది. అతను వొస్తే ఏం చెయ్యాలో తోచదు. ఎలా వుంటాడో! ఏం చేస్తాడో! ఏమంటాడో! అలికిడైతే చాలు గుండె దడదడ కొట్టుకొనేది; వొళ్ళు వశం తప్పి మూర్ఛ వచ్చినట్టయ్యేది. "సీనప్పా!" అనుకుంది సిద్దమ్మ. సీనప్ప వొస్తున్నడేమో అని రెండు మూడుసార్లు బయటకు వెళ్ళి చూచివొచ్చింది. ఒకసారి చీకట్లో రంయస కొండలదాక వెళ్ళింది. సీనప్ప కనవడలేదు. వెంటనే మరొకదారిని ఇంటికి వొచ్చాడేమో అనుకుని వెనక్కి పరుగెత్తుకొని వొచ్చింది సిద్దమ్మ.

సిద్దమ్మ ఇంటికి వొచ్చేటప్పటికి సీనప్ప రాలేదు. పిల్లవాడు మాత్రం లేచి గుక్కలుపట్టి ఏడుస్తున్నాడు. సిద్దమ్మ పిల్లవాడికి పాలిచ్చి పండుకో బెట్టింది.

లేచి వొచ్చి మరిదిని లేపింది సిద్దమ్మ.

"నిజం చెప్పయ్యా" అన్నది సిద్దమ్మ.
"బద్దకంగా వుంటేనూ" అన్నాడు మరిది

"చెప్పవూ?" అడిగింది సిద్దమ్మ.
"చెపుతా" అన్నాడు మరిది.
"అతగా దొస్తానన్నది ఇవ్వాళేనా?"

"ఏడో రోజు; అంటే ఇవ్వాళే. ఒకటి – రెండు – మూడు – నాలుగు – అయిదు – ఆరు – ఏడు" అన్నాడు మరిది.

"ఇంకా రాలేదు" అన్నది సిద్దమ్మ.

"చూడూ!" అన్నాడు మరిది.

"చూచా!" అన్నది సిద్దమ్మ.

"ఒచ్చేఏమిందు కొండమీద దీపం వెలిగిస్తానన్నాడు" అన్నాడు మరిది.

"దీపమా!" అన్నది సిద్దమ్మ.

"దీపమే!" అన్నాడు మరిది.

"మదనష్టపాడు!" అన్నది సిద్దమ్మ మురిపెంగా.

"ఎటు తిరిగితే అటే" అన్నాడు మరిది.

సిద్దమ్మా, మరిదీ కొండవైపు చూస్తూ కిటికీ దగ్గర నిలబడ్డారు. ఎంతసేపు చూదినా చీకటి నలుపుకంటే కాటునలుపుగా కొండే కనిపిస్తూ వుంది.

"ఆరిపోయిందేమో" అన్నది సిద్దమ్మ.

"అహ్!" అన్నాడు మరిది.

"గాల్లో దీపం" అన్నది సిద్దమ్మ.

"గుళ్లో లింగం" అన్నాడు మరిది.

చూచి చూచి కళ్ళు చిల్లులు పడుతున్నై సిద్దమ్మకి.

సిద్దమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

రైల్లో గుడ్డివాళ్ళు పాడుకునే పాట జ్ఞాపకం వచ్చింది.

ఎంత పని చేసితివి రామా....

నిన్నే మనందును, సార్వభౌమా....'

"అదుగో" అన్నాడు మరిది.

"ఏమిటి?" అడిగింది సిద్దమ్మ.

"కొండమీద దీపం" అన్నాడు మరిది.

సిద్దమ్మ రివ్వున కొండపైపు తిప్పింది తల.

నిజంగా కొండమీద దీపం! సిద్దమ్మకి ఈ తడవ యేపాటా జ్ఞాపకం రాలా.

"ఓ మరిదీ?" అన్నది సిద్దమ్మ.

"ఏం వదినా?" అడిగాడు మరిది.

"ఎందుకు దీపం అటూ ఇటూ ఊపుతాడు?" అడిగింది సిద్దమ్మ.

"వస్తున్నా, వొస్తున్నా అనే గుర్తుకి" అన్నాడు మరిది.

"ముదనష్టపాడు! అన్నది సిద్దమ్మ మురిపెంగా.

చటుక్కున కొండలమధ్య తుపాకి పేలింది. సిద్దమ్మగుండె గుభేలు మన్నది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

సిద్దమ్మ పిల్లవాణ్ణి గుండెలకి హత్తుకుంది.

"మరిదీ, మరిదీ" అన్నది సిద్దమ్మ.

"ఏం వదినా?" అన్నాడు మరిది.

"కొండమీద దీపం" అన్నది సిద్దమ్మ.

"ఆరిపోయింది!" అన్నాడు మరిది.

"మరి సీనడో?" అంది సిద్దమ్మ.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

మళ్ళీ కొంచలమధ్య తుపాకీ పేలింది. మరిది ఉప్పెనకు మల్లే రివ్వున వెళ్ళాడు కొండమీదకి. సిద్దమ్మకి అంతా అయోమయంగా వుంది. గుడ్లు అప్పజెప్పి చూస్తూ నుంచుంది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

"ఉండరా" అన్నది సిద్దమ్మ.

అత్తమామలు ఎవరికళ్ళు వాళ్ళు నులుముకుంటూ వొచ్చారు. మామకి సిద్దమ్మని పలకరించటానికి భయంవేసింది.

అందుకని వెంకమ్మని పలకరించాడు.

"వెంకమ్మా?"అన్నాడు వెంకయ్య.
"ఏంది ముసలాయనా?"
"మరి గత్తే...." అన్నాడు వెంకయ్య.
"అడుక్కో" అంది వెంకమ్మ.
"ఆ మోత ఎక్కడిదీ అంట!"
"ఏ మోతా?" అంది వెంకమ్మ.
"ఇందాకటిదే!" అన్నాడు వెంకయ్య.
"అదా?" అంది వెంకమ్మ.
"అదేనే" అన్నాడు వెంకయ్య.
"చెప్పనా ముసలాయనా?"
"చెప్పవే, నా మొహిరీ!"

"చెవ్వేదీ?" అన్నది వెంకమ్మ.
"ఇదిగో" అన్నాడు వెంకయ్య చెవుని అందిస్తూ.
"మరే—" అన్నది వెంకమ్మ చెవులో.
"కారికేవే, భామా" అన్నాడు వెంకయ్య.
"ఆ మోతే—" అంది వెంకమ్మ చెవులో.
"ఓసి లలనా, మగువా, సకియా, చెప్పవే" అన్నాడు వెంకయ్య.
"నేను చెప్పను ముసలాయనా" అన్నది వెంకమ్మ.

మళ్ళీ కొండలమధ్య తుపాకులు పేలినై, ఈసారి వొక్కసారి కాదు; వరసనే ఆరుసార్లు. సిద్దమ్మ కళ్ళు అగ్ని గోళాలయినై. సీనప్ప ఏమయ్యాడు? మరిది ఏమయ్యాడు? పిల్లవాణ్ని గుండెలకు అదుముకొని కొండలవైపు పరుగెత్తింది సిద్దమ్మ. చీకటిలో కలిసిపోయింది సిద్దమ్మ.

"వెంకమ్మా!" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా?" అన్నది వెంకమ్మ.

"ఇప్పుడు ఈ మోత అనేది వొకటివుంది చూశావూ" అన్నాడు వెంకయ్య.

"మాదకేం?" అన్నది వెంకమ్మ.

"ఎవరు చేశారో నీకేమన్నా తెలుసటే?" అన్నాడు వెంకయ్య.

"తెలియకేం?" అన్నది వెంకమ్మ.

"తెలిస్తే చెప్పవేం" అన్నాడు వెంకయ్య.

"తొత్తుకొడుకులు కామాలు" అన్నది వెంకమ్మ.

వెంకయ్యకి ఏమీ తోచలేదు. కొంచెం సేపు ఆగి మళ్ళీ అడిగాడు.

"సరేగాని వెంకమ్మా—"

"అడుక్కో ముసలాయనా" అన్నది వెంకమ్మ.

"గంజేరాకు అంటే ఎందుకే నీకు అంత ఇష్టం" అడిగాడు వెంకయ్య.

"మణేదారు రామయ్యమూలానే కామాలు" అన్నది వెంకమ్మ.

"అంతే అంటావా?" అన్నాడు వెంకయ్య.

"అంతే ముసలాయనా" అన్నది వెంకమ్మ.

ఇంతలో ఒక పోలీసు రొప్పుకుంటూ వచ్చాడు. పోలీసును చూచి వెంకయ్యా,వెంకమ్మా మళ్ళీ మూలకి వెళ్ళారు.

పోలీసు బుజంమీద తుపాకివుంది. నెత్తిన టోపీవుంది. కళ్ళేమో చింతనిప్పులాగ వున్నాయి.

ఇంట్లో అడుగు పెడుతూనే "ఎవరక్కడ!" అన్నాడు పోలీసు.

"కిటికీ" అన్నాడు వెంకయ్య.

"కాదు, కాదు చీకటి" అన్నది వెంకమ్మ.

"ఏదో వొకటి" అన్నాడు వెంకయ్య.

"సీనప్ప తలిదండ్రులు మీరేనా?" అన్నాడు పోలీసు

"ఏమిటే అంటాడు వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య

"ఏందో పాడు" అన్నది వెంకమ్మ.

"చెప్పరేం?" అన్నాడు పోలీసు కోపంగా.

"చెప్పవే?" అన్నాడు వెంకయ్య విసుగ్గా.

"అడుక్కో—మను" అన్నది వెంకమ్మ.

"అడుక్కో— పోలీసూ" అన్నాడు వెంకయ్య.

పోలీసుకి కోపం వచ్చింది. భుజంమీద తుపాకి క్రిందికి దించాడు. నెత్తిమీద టోపీ చేత్తోపట్టుకున్నాడు సరే, కళ్ళు చింత నిప్పులు.

"మీరేనా సీనప్ప...." అని మొదలుపెట్టాడు పోలీసు.

వెంకమ్మకి తటాలున జ్ఞాపకం వొచ్చింది.

"అయ్యో ముసలాయనా!" అన్నది వెంకమ్మ.

"ఏమిటే వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య.

"మన సీనప్ప, ముసలాయనా...." అన్నది వెంకమ్మ.

వెంకయ్యని కౌగిలించుకుని బావురుమని ఏడ్చింది. వెంకయ్య కేమీ అర్థంకాలా.

"ఇదేమిటే?" అన్నాడు వెంకయ్య.

"సీనప్పని చంపారు" అన్నది వెంకమ్మ.

"ఆఁ" అన్నాడు వెంకయ్య.

"సీనప్ప తమ్ముణ్ణి కూడా ముసలాయనా" అంది వెంకమ్మ.

"ఊఁ" అన్నాడు వెంకయ్య.

"సిద్దమ్మనీని" అంది వెంకమ్మ.

"అట్టాగటే, భామా" అని తనూ వెక్కి వెక్కి ఏడిచాడు. ఇక యేడుప కంతులేదు. ఏడుపు ఆపుకుంటూనే మరిచిపోయాడు వెంకయ్య. ఏడుపే ఏడుపు; ఒకటే ఏడుపు.

"మిమ్మల్ని అరెస్టు చేశాను" అన్నాడు పోలీసు.

"ఉఁజ్ఞ, ఉఁజ్ఞ!" అంది వెంకమ్మ.

"అదేమిటే పిల్లా?" అన్నాడు వెంకయ్య.

"సిద్దదు!" అంది వెంకమ్మ

"పదండి" అని తుపాకిమడిమతో పొడిచాడు పోలీసు. తుపాకీ భుజాన వుంచుకున్నాడు టోపీ నెత్తిన పెట్టుకున్నాడు.

పోలీసుకి కళ్ళులేవు; ఉన్నవి చింత నిప్పులు.

)o............o(